కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.31, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.41, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.26, గోకరకాయ రూ.50, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.75, చామగడ్డ రూ.28, మునగ రూ.55, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.27, కీర రూ.40, బీన్స్ రూ.90, క్యాప్సికమ్ రూ.71. ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పూజల్లో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అల్కాపురిలోని సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి దంపతులు సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు



ఇన్‌స్పెక్టర్ మహేశ్

హస్తినాపురం: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత మంది యువకులు, ఆకతాయిలు బాలికలు, మహిళలను బెదిరిస్తూ వారిపట్ల దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించిన వారిపై పోక్సోచట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు.వేధింపులకు గురైతే వెంటనే వాట్సాప్ నంబర్‌కు 8712662111 ఫిర్యాదు చేయాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువత

మన్సూరాబాద్: తలసీమియా చిన్నారుల సహాయార్థం జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని జైభారత్ కేంద్ర కార్యాలయం ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవనంలో గురువారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఖదిజ్జాసీ ఆజాద్ షేక్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 74 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభారత్ నాయకులు వంశీ, సుధాకర్, మల్లీకావల్లభ, గణేష్, రాజు, ఉమ, లక్ష్మి, దుర్గారెడ్డి, స్వాతి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు

వనస్థలిపురం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురంలో శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అన్వరానంద బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్న హాజరై పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బద్దం వినోద్‌రెడ్డి, నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, రఘుగౌడ్, వెంకీ, సంజీవరెడ్డి, సత్తిరెడ్డి, సుజిత్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, నర్సింగ్, రాంమోహన్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సుబ్బారాయుడు, పెద్దిరాములు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.45 లక్షలు మంజూరు



చెకొలేకర్ లక్ష్మి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ మరమ్మతుల కోసం రూ.45 లక్షలు నిధులు విడుదలైనట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌జీఎస్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్నాయని, అదే విధంగా షెడ్‌లలో గుంతలు ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాటికి మరమ్మతు చేయిస్తామన్నారు.దాదాపు రూ. 2 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి, డైరెక్టర్ కిషన్‌సింగ్ పాల్గొన్నారు.

100 కాలనీల్లో నేటికీ మట్టి రోడ్లే!

శివారు కాలనీల్లో మౌలిక వసతుల లేమి

డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ లేక ఇబ్బందులు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్‌మెడోస్ కాలనీ



ఎల్‌బీనగర్ శివారు కాలనీల ప్రజల గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని ఏళ్ల తరబడి ఆయా కాలనీల్లో మట్టిరోడ్లే దిక్కుగా మారాయి. వర్షం వస్తే కాలనీలకు వాహనాలతో పాటు కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. తాము ప్రతి సంవత్సరం జీహెచ్ఎంసీకి ఆస్తి పన్నులు చెల్లిస్తున్నా తమ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీల్లో ఉన్న మట్టి రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. దీనికి తోడు వర్షం వస్తే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. మట్టి రోడ్లలో ఇంటికి చేరాలంటే నరకప్రాయంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచి ద్విచక్రవాహనాలు జారి కిందపడిపోతున్నాయి. భారీ వాహనాలు ఆ రోడ్లపై వెళ్తే ఇరుక్కుని నానా తంటలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. –ఎల్‌బీనగర్

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో సుమారు రెండు వందల కిలో మీటర్ల మట్టి రోడ్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో శివారు కాలనీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంటి అనుమతులు, ఎల్ఆర్ఎస్‌ల పేరుతో ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. పూర్తి స్థాయిలో కాలనీలలో నివాసాలు ఏర్పడిన మౌలిక సదుపాయాలు కలిపించకపోవడంపై కాలనీ సంక్షేమ సంఘాలు మండిపడుతున్నాయి. టాక్స్‌లు చెల్లించకుంటే అధికారులు భయభ్రాంతులకు గురిచేయడం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పాపిరెడ్డి కాలనీ మట్టి రోడ్డు

తాగునీటి కొనుగోలు..

శివారు కాలనీల్లో చాలా కాలనీలకు ఇప్పటికి డ్రైనేజీ, తాగునీరు పైపులైన్ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వసతులు కల్పించాలని ఏళ్ల తరబడి అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక నీరు కొనడానికి కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. కనీసం వర్షా కాలంలోనైన రోడ్లలో గుంతలను మట్టితోనైన పూడ్చాలని కాలనీల వాసులు కోరుతున్నారు.మౌలిక సదుపాయాలు లేక ఇళ్లను అద్దెలకిచ్చే పరిస్థితిలేదని, కాలనీల పరిస్థితి చూసి అద్దెలకు ఎవరూ రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

శివారు కాలనీల్లో డ్రైనేజీ,తాగునీరు సౌకర్యం లేకపోవడంతో రోడ్లు వేయడంలో ఆలస్యమవుతోంది. జలమండలి ఆధ్వర్యంలో తాగునీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో శివారు కాలనీలలో సుమారు రెండు వందల కిలో మీటర్ల వరకు రోడ్లు వేయాల్సి ఉంది. ఇప్పటికే పలు కాలనీలకు రోడ్లు మంజూరు చేయడం జరిగింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–రమేష్‌బాబు, ఈఈ ఎల్‌బీనగర్ సర్కిల్–3

మ్యాన్‌హోల్.. మూతల్లేవ్



దిల్‌సుఖ్‌నగర్/చైతన్యపురి: మలక్‌పేట్ జోన్ పరిధిలోని పలు మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలయ్యాయి. పలు ప్రాంతాల్లోని మ్యాన్‌హోళ్లకు మూతలు లేవు. వరద ప్రవాహానికి కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరని వాపోతున్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో మూతల్లేని మ్యాన్‌హోళ్లు చాలా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. చైతన్యపురి ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులే మ్యాన్‌హోల్ గుంతలో కర్రలు పెట్టారు.వెంటనే మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆలయాల వద్ద వసతులు కల్పించండి



వాగామ్రి మాతాను దర్శించుకున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన వసతులు కల్పించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. గురువారం ఐఎస్‌సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పలువురు ఆలయాల కమిటీ ప్రతినిధులకు దేవాదాయ శాఖ అధికారులు మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయాన్ని దేవాలయ అభివృద్ధి, బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ డివిజన్‌లోని పెద్దతోట వాగామ్రి మాతా ఆలయం సహా పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. ఈ నెల 20, 21న నిర్వహించనున్న బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ అశోక్, దయా కాళి పాల్గొన్నారు.

ఎంపీకి కృతజ్ఞతలు

హయత్‌నగర్: తమ కాలనీలలో సమస్యలను పరిష్కరించేందుకు సహాయ సహకారాలు అందించారని హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల వాసులు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి కాలనీ, సిద్ధి వినాయకనగర్ కాలనీవాసులు మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న తమ కాలనీలలో బూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించేందుకు ఎంపీ ఎంతో సహాయం అందించారన్నారు. ఎంపీని కలిసిన వారిలో గంగని శ్రీను, పారంద మహేష్, ఎర్రవెల్లి సత్యనారాయణ, నర్సింహులు, నాగేశ్వరరావు, రమణ, రాంబాబు, వీరేష్, మహేందర్‌రెడ్డి, చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీలవాసులు

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



వీరయ్యను సన్మానించిన నాయకులు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వీరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పలువురు వికలాంగుల సంఘాల నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కన్నా సంవత్సర కాలంలో వికలాంగుల సమగ్ర అభివృద్ధికి పాటు పడ్డామన్నారు. వికలాంగులకు ఉన్నతవిద్య, రాజీవ్ యువ వికాసం పథకం, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించామన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలు అందేలా చట్టం చేశామన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా వికలాంగులకు ప్రోత్సహకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేశగాని సతీష్, నర్సింహా చారి, సురేష్, స్వామి, శంకర్, పరమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడం బాధాకరం



నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడం సిగ్గుచేటని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రాం శేఖర్ మండిపడ్డారు. గురువారం ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరు నెలల్లో ఉస్మానియా ఆసుపత్రికి పలువురు విద్యార్థులు వైద్యం కోసం రాగా వారిలో 109 మందికి కిడ్నీ వ్యాధులు ఉన్నట్లు వైద్యులు గుర్తించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగడానికి సరైన మంచి నీరు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. మంచినీరు తాగితే మూత్ర విసర్జన చేయాల్సి వస్తోందని బాలికలు నీరు తాగడం లేదని, దాని వల్లే కిడ్నీలు దెబ్బతింటున్నాయని అన్నారు. అనంతరం గురుపౌర్ణిమ సందర్భంగా ఆయన జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, కాన్షీరాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

హస్తినాపురం: ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ పేర్కొన్నారు గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి డివిజన్ అభివృద్ధికి రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి ఎన్నో కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ, హనుమాన్‌నగర్‌కాలనీ, గణేశ్‌నగర్‌కాలనీ, అగ్రికల్చర్‌కాలనీ, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్‌కాలనీలో రోడ్లకు సంబంధించి రూ. 4 కోట్లు మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



పుస్తకాల పంపిణీ



సైదాబాద్: విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సేఫ్ ఫౌండేషన్ అకాడమిక్ ఇన్‌చార్జ్ శ్రీను సూచించారు. గురువారం ఆయన ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సింగరేణి కాలనీ, శంకేశ్వరబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. తరగతి గదుల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలన్నారు. సాయంత్రం శంకేశ్వరబజార్, సింగరేణి కాలనీలో సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లకు వెళ్లి హోం వర్క్ చేయటం, పాఠ్యాంశాల్లోని అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్, భగవాన్, ఫౌండేషన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ వల్లి సాహెబ్ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు అన్యాయం జరుగుతోంది



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గత కొన్నెళ్లుగా పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నెళ్లుగా ఇతర రాజకీయ పార్టీల నేతలు ఎన్ని ఇబ్బందులు సృష్టించినా పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధికి పనిచేసిన నాయకులను నేడు విస్మరిస్తుండటం బాధాకరమన్నారు. మార్కెట్ కమిటీ, దేవాదాయ కమిటీల్లో ఏడాది క్రితం పార్టీలోకి వచ్చిన వలస నేతలకు ఇవ్వడంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి అక్కన్న మాదన్న మహంకాళి బోనాలు

యాకుత్‌పురా: హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 77వ వార్షిక బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. నందా ముఖ్యఅతిథిగా హాజరై ధ్వజారోహణ చేసి ఉత్సవాలను ఘనంగా ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆలయంలో కలశ స్థాపన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం 11 గంటలకు అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

బాబా దర్శనం.. పోటెత్తిన భక్తజనం



బారులు తీరిన భక్తులు

గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద గురువారం తెల్లవారుజామునుంచే భక్తులు బాబా దర్శనం కోసం బారులుతీరారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసగుప్తా బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. –చైతన్యపురి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాబా పూజల్లో మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం



బాబాను దర్శించుకున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



బాలాజీనగర్‌లో సాయిబాబా ఆలయంలో..

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం ఓల్డ్‌మలక్‌పేటలోని పంచశీల్ లైబ్రరీలో మలక్‌పేట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంటమాలజీ సిబ్బంది తరచూ దోమలు వ్యాపించే ప్రాంతంలో ఫాగింగ్ చేయాలని అన్నారు. కాలనీలు, బస్తీల్లో వైద్య సిబ్బంది తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైపుద్దీన్ షఫీ, వాసు, అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ తక్కువ ఉన్న మార్గాలను వినియోగించుకోండి

మలక్‌పేట: సౌత్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు గురువారం మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి రద్దీ ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు ఉదయం మలక్‌పేట మీదుగా కార్యాలయాలకు వెళ్లే ప్రజలు చాదర్‌ఘాట్ బ్రిడ్జిని ఉపయోగించకుండా చాదర్‌ఘాట్ సర్కిల్ నుంచి నేరుగా ఎంజీబీఎస్, ఎస్‌జే రోటరీ, ఎంజే మార్కెట్ మీదుగా నాంపల్లి లేదా జీపీఓ వైపు వెళ్లవచ్చన్నారు. ఉదయం ఈ మార్గంలో ట్రాఫిక్ అంతరాయం చాలా తక్కువగా ఉంటుందని, ఈ మార్గాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

